అండర్‌పాస్ వద్దు.. ఫ్లైఓవరే ముద్దు

పనామా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మళ్లీ నిరసన


పనామా చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా చౌరస్తాలో అండర్‌పాస్ నిర్మాణానికి బదులుగా ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని బీజేపీ హయత్‌నగర్, మన్సూరాబాద్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, పలువురు నాయకులు పేర్కొన్నారు. అండర్‌పాస్ వద్దని, ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని రెండు రోజుల క్రితం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అండర్‌పాస్ నిర్మాణం పనులు జరుగుతుండటంతో గురువారం వారు పనామా వద్ద మళ్లీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అండర్‌పాస్‌ల వల్ల రోడ్డుకు ఇరువైపులా ఉండే షాపుల వారి వ్యాపారం దెబ్బతిని వారి జీవనోపాధి పోతుందని, యూటర్న్ సమస్యలు వస్తాయని వారు అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అండర్ పాస్ నిర్మాణాలను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారి భాస్కర్, కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, తడకమళ్ల విజయ్‌కుమార్, నూతి శ్రీనివాస్, పారంద మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల నిర్వహణ మెరుగుపర్చండి


అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో వీధి దీపాల నిర్వహణ మెరుగుపర్చాలని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ, ట్రాన్స్‌కో అధికారులతో వీధి దీపాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు నిర్ణీత వేళల్లో వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలు కాలనీల్లో స్ట్రీట్ లైట్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, అధికారులు వెంటనే ఆయా ప్రాంతాల్లో పర్యటించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. నిర్ణీత సమయాల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ హకీం, లైన్‌మెన్ నరసింహ, రహీం, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోకుల్‌నగర్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు పరిష్కరించండి

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో గతంలో వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో మురుగునీరు నిరంతరం రోడ్డుపై పారుతుండంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వెంటనే కొత్త డ్రైనేజీ లైన్ నిర్మించాలని కార్పొరేటర్‌ను కోరారు. అలాగే కాలనీలోని రోడ్డు, తాగునీటి సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ పవన్‌కుమార్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోకుల్ నగర్ కాలనీ అధ్యక్షుడు సంపత్ యాదవ్, లావణ్య, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దాం


లింగోజిగూడలో మొక్కలు పంపిణీ చేస్తున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకపాత్ర వహిస్తాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి) కార్యక్రమంలో భాగంగా గురువారం లింగోజిగూడ డివిజన్ సరూర్‌నగర్ బస్టాప్ వద్ద సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. సామ రంగారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్ అసెంబ్లీలోని అన్ని పోలింగ్ బూత్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జూన్ 23 నుంచి నుంచి జూలై 6వ తేదీ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వరకు అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని నరేంద్ర మోదీ పిలుపునివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఇంట్లో ఒక్క మొక్క నాటడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిద్దామని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్కాజిగిరి కుమార్, కృష్ణంరాజు, నాగరాజు, హరిప్రసాద్, శ్రీనివాస్, ప్రశాంతి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

◆ డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా వనస్థలిపురం డివిజన్ క్రాంతిహిల్స్ కాలనీలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. నాయకులు రాంరెడ్డి, మధుకర్‌గౌడ్, రాజ్‌కుమార్, భద్రరాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువ పనులు వేగవంతం చేయాలి: వంగ


వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని లోతట్టు కాలనీల్లో చేపట్టిన వరద నీటి కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో ప్రారంభించిన వరద నీటి నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు స్థానికులకు కొంతమేర ఇబ్బందులు తలెత్తుతాయని, కాలనీవాసులు సమన్వయం పాటించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మహంకాళమ్మతోట, హరిజనవాడ, నవజీవనజ్యోతి కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్కిల్ అధికారులు రాజు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు బలరాజ్, రాములు, శ్రీనివాస్, లింగయ్య, నాయకులు కృష్ణారెడ్డి, శ్రవణ్, వెంకటేష్, వేణుగోపాల్, రవి పాల్గొన్నారు.

ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్‌ను పునరుద్ధరించాలి

సీఎంకు న్యాయవాది రాపోలు భాస్కర్ వినతి



సైదాబాద్: ప్రజల భూములను సంరక్షించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1982లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని హైకోర్ట్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మెయిల్ ద్వారా వినతి పత్రం పంపించారు. అనంతరం సైదాబాద్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లోని కార్యాలయంలో రాపోలు విలేకరులతో మాట్లాడుతూ, పేదలు, అమాయకులకు చెందిన విలువైన భూములను కొందరు ఆక్రమణదారులు కబ్జాలు చేస్తూ పీడించడాన్ని నిరోధించడానికి అప్పటి ప్రభుత్వం ఈ యాక్ట్‌ను తెచ్చిందన్నారు. ఆ చట్టంతో పేదల భూములు సంరక్షించబడి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను చట్టవిరుద్ధంగా ఒక జీఓతో రద్దు చేసిందని విమర్శించారు. దాంతో మళ్లీ కబ్జాల పర్వం పెరిగి ప్రస్తుతం కోర్టుల్లో భూ వివాదాల కేసులు లక్షల్లో పేరుకుపోయాయని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల భూములను రక్షించడానికి ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్‌ను పునరుద్ధరించాలని రాపోలు భాస్కర్ కోరారు.

ఏం కొనేటట్టు.. తినేటట్టు లేదు!

- ఆకాశాన్ని అంటుతున్న కూరగాయల ధరలు
- నాన్‌వెజ్ రేట్లకు సమానంగా పెరుగుతున్న వైనం
- కొనలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి జనం


వనస్థలిపురం రైతుబజార్

వనస్థలిపురం: రోజురోజుకూ కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇక ఏం కొనేటట్టు.. ఏం తినేటట్టు లేదని వాపోతున్నారు. కిలో కూరగాయల ధర రూ. 50 మొదలుకొని రూ. 100 వరకు చేరుకుంటుండటంతో కూరగాయలు కొనలేక పేదలు గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ. 200 నుంచి 300 పెడితే వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవని, నేడు రూ. 500 నుంచి 600 పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాంసా హారానికి దీటుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయని, ఇలా అయితే.. కూరలు వండుకునేది.. తినేది ఎలాగని అంటున్నారు.

◆ ప్రస్తుతం రైతుబజార్లలో, బహిరంగ మార్కెట్లలో రెండు, మూడు రకాలు తప్ప మిగతా రకాల కూరగాయల ధరలు రూ. 50కి పైగా, రూ. 100కు చేరువలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతంలో రూ. 20, 30 పెడితే కిలో కూరగాయలు వచ్చేవని, ఇపుడు రూ. 50 నుంచి 80 ధరల్లో కిలో లభ్యం అవుతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు.

◆ ఇంతకుముందు కిలో కొన్నచోట ప్రస్తుతం అరకిలో, పావుకిలో కొని సరిపెట్టుకోవాల్సి వస్తోందని అంటున్నారు.

◆ గురువారం రైతుబజార్లలో కిలో టమాటా ధర రూ.43, వంకాయ రూ. 35, బెండకాయ రూ. 50, పచ్చిమిర్చి రూ.65, కాకర రూ. 52, బీర రూ. 35, ఫ్రెంచిబీన్స్ రూ.105, క్యారెట్ రూ.40, చిక్కుడు రూ.65, గోకర రూ.50, క్యాప్సికం రూ.65, ఆలు రూ.37, చామగడ్డ రూ. 35 ఉంది.

◆ ఆకుకూరలు సైతం గతంలో రూ. 10కి 5, 6 కట్టలు వచ్చేవి.. ప్రస్తుతం ఒక్క కట్టకు రూ.10 నుంచి రూ. 20 ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

◆ రైతుబజార్లలో ధరలు ఇలా ఉంటే.. బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ. 20 నుంచి 30 అదనంగా ఉన్నాయని, ఏ కూరగాయలైనా పావుకిలోకు రూ. 20 చొప్పున వసూలు చేస్తున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. దీంతో కిలోల లెక్కన కూరగాయలు కొనలేక అరకిలో, పావుకిలోతో సరిపెట్టు కోవాల్సి వస్తోందని అంటున్నారు. గతంతో పోలిస్తే కొన్ని రకాల కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయని వారు వాపోతున్నారు.

రూ. 600 పెట్టినా వారం సరిపడా రావడం లేదు

కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయి. గతంలో రూ. 300 పెడితే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. నేడు రూ. 600 పెట్టినా వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. బహిరంగ మార్కెట్లో ఏ కూరగాయ కొన్నా పావుకిలోకు రూ.20 చెప్తున్నారు. అంటే కిలో కూరగాయలకు రూ. 80 చొప్పున పెట్టాల్సివస్తోంది. దీంతో కిలో కూరగాయలు కొనేచోట పావు కిలో, అర కిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

–ఎ. నిర్మల, గృహిణి, వనస్థలిపురం

దిగుబడి తగ్గింది



ఇటీవలి వరకు ఎండలు అధికంగా ఉండడం సాగుబడి తగ్గింది. వర్షాకాలం ప్రారంభ దశలోనే ఉండటంతో ఇంకా కొత్త పంటలు రాలేదు. దీనికి తోడు కొన్ని రకాల కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి వస్తాయి. వివిధ కారణాల వల్ల బయటి నుంచి వచ్చే కూరగాయలు రావడం తగ్గింది. వనస్థలిపురం రైతుబజారుకు గతంలో రోజుకు 550 క్వింటాళ్ల వరకు వచ్చే కూరగాయలు ప్రస్తుతం 450 క్వింటాళ్ల కూడా రావడం లేదు. ఆగస్టు నాటికి కొత్త పంటలు వస్తే కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉంది.

–ఈఓ స్వప్న, రైతుబజార్, వనస్థలిపురం

ముమ్మరంగా పోలీసు తనిఖీలు


రెయిన్‌బజార్‌లో చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చంచల్‌గూడ: మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. రాత్రి వేళల్లో సమయానికి దుకాణాలను బంద్ చేస్తున్నారా లేదా అని పలు ప్రాంతాల్లో సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, సీఐ శ్రీనివాస్ బృందం తిరిగి పరిశీలించింది.

అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయండి: ఎస్‌ఎఫ్‌ఐ

అబ్దుల్లాపూర్‌మెట్: ఎలాంటి అనుమతులు లేకుండా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాములలో కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఎంఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శివకుమార్ మాట్లాడుతూ.. సదరు పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోగా, నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయాలు ఫీజుల రూపంలో వసూలు చేస్తోందని ఆరోపించారు.

బడంగ్‌పేటలో ట్రాఫిక్ జాం



బడంగ్‌పేట్: బడంగ్‌పేట చౌరస్తా (పాత గ్రామ పంచాయతీ కూడలి)లో ఉదయం సమయంలో నిత్యం ట్రాఫిక్ జాంతో వాహనదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. గురువారం ఉదయం గంట పాటు ట్రాఫిక్ జామైంది. స్కూల్ బస్సులు, బైకులపై స్కూళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ టూ ఆదిబట్ల వరకు, అక్కడి నుంచి ఇబ్రాహీంపట్నం, అలాగే ఔటర్ రింగురోడ్డుకు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ఇదే రోడ్డు కావడంతో ఉదయం 7.30 నుంచి 9 వరకు రోడ్డు బిజీగా ఉంటోంది నాదర్‌గుల్ మీదిగా ఆదిబట్ల వరకు సుమారు వెయ్యికి పైగా బస్సులు వెళ్తుంటాయి. ఇవిగాక బైకులు, భారీ వాహనాలు, లారీలు, టిప్పర్లు అటువైపుగా వెళ్తుంటాయి. నాదర్‌గుల్ నుంచి బాలాపూర్ చౌరస్తాకు, బడంగ్‌పేట చౌరస్తాలోనే ప్రభుత్వ పాఠశాల ఉండటం, ఆర్టీసీ బస్‌లు అక్కడే ఆగుతుంటాయి. దీంతో నిత్యం గంటన్నర పాటు చౌరస్తాలో ట్రాఫిక్ జాం అవుతోంది.

ట్రాఫిక్ పోలీసులను నియమించాలి

ఉదయం ఉ.7.30 నుంచి 9 గంటల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని వాహనదారులు చెబుతున్నారు. ఇద్దరు లేదా ముగ్గురు ట్రాఫిక్ పోలీసులను నియమిస్తే సమస్యకు చెక్ పెట్టవచ్చు. లేదా సిగ్నలింగ్ ఏర్పాటు చేస్తే మరి మంచిదని ప్రజలు భావిస్తున్నారు.

డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఆందోళన


ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

చైతన్యపురి: వచ్చే నెల 17నుంచి ప్రారంభమయ్యే డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన చేపట్టారు. నిరుద్యోగ సంఘం నాయకుడు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరీక్షలను వాయిదా వేసి 25 పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్‌ను ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో పలు పోటీ పరీక్ష శిక్షణా సంస్థల అభ్యర్థులు పాల్గొన్నారు.

అల్లనేరేడుతో ఆరోగ్యం!

సీజనల్ ఫ్రూట్స్‌కు డిమాండ్

- దివ్య ఔషధంగా పని చేస్తున్న వైనం



హుడాకాంప్లెక్స్: వర్షాకాలంలో విరివిగా దొరికే అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి ఔషధంలా పని చేస్తున్నాయి. మధుమేహాన్ని నియంత్రించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వర్షాకాలంలో వచ్చే వివిధ రకాల ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతుండటంతో వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సరూర్‌నగర్ రైతుబజార్ సహ ప్రధాన రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున అమ్ముతున్నారు.

మార్కెట్‌కు పోటెత్తుతున్న పండ్లు

నేరేడు పండ్లు మార్కెట్‌కు పోటెత్తుతున్నాయి. ప్రధాన మార్కెట్లోనే కాకుండా వ్యాపారులు కాలనీలు, బస్తీలు తిరుగుతూ విక్రయిస్తున్నారు. పుష్కలమైన ఔషధగుణాలు ఉన్న ఈ పండ్లు మార్కెట్‌లో కేజీ రూ.150పైగా పలుకుతుంది. సీనియర్ సిటిజన్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. తమ పిల్లలకు కూడా వీటి రుచిని చూపిస్తున్నారు. ఒగరు, పులుపు, తీపి కలయికలతో కూడిన నేరేడు పండ్లను తినేందుకు పిల్లలు కూడా ఆసక్తి చూపుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు లంచ్‌బాక్స్‌లో ఈ పండ్లనే పెట్టి పంపుతుండటం కొసమెరుపు.


ఔషధ గుణాలు పుష్కలం

నేరేడు పండ్లు తినడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతోంది. ఫలితంగా మలబద్ధకం, గ్యాస్ ట్రబుల్, అజీర్తి వంటి సమస్యలను నుంచి విముక్తి లభిస్తుంది. మధుమేహాన్ని నియంత్రిస్తుండటంతో వీటి కొనుగోలుకు క్యూ కడుతున్నారు. పండులో పీచు పదార్థం అధికం. ఐరెన్ సంవృద్ధిగా ఉండటంతో ఎర్రరక్త కణాలను పెంచుతుంది. రక్త హీతనను తగ్గిస్తుంది. బరువు తగ్గాలని భావించే వారికి ఈ పండు చిరు తిండిలా పని చేస్తుంది. హిమోగ్లోబిన్ శాతం పెరుగుతోంది. వీటిని తిన్న వెంటనే మంచినీరు కానీ, పాలు కానీ తాగొద్దు.

– డాక్టర్ అమరవాది ప్రభాకరాచారి, సీనియర్ వైద్య నిపుణుడు

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

నాగోలు: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని నాగోలు పూర్వ విద్యార్థుల సంఘం (నోసా) అధ్యక్షుడు కందికంటి కన్నాగౌడ్ అన్నారు. నాగోలు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకర్లమూడి పీటర్ ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం నాగోలు శుభం కన్వెన్షన్ లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడిగా పీటర్ 36 ఏళ్ల పాటు సేవలందించారని కన్నాగౌడ్ కొనియాడు. ఈ సందర్భంగా పీటర్ దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యర్థుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇన్చార్జి హెడ్మాస్టర్ రవి కుమార్, నోసా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, ఎస్‌ఎంసీ సభ్యులు జిల్కపల్లి శ్రీనివాస్ రెడ్డి, పల్లె లింగం గౌడ్, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, నాళ్ల ఉమామహేశ్వర గుప్తా, సిద్ది రమేష్ గుప్తా, డప్పు రాజు తదితరులు పాల్గొన్నారు.


పీటర్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రహదారికి మరమ్మతులు చేయండి


కృంగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో బావర్చీ హోటల్ ఎదురుగా జాతీయ రహదారి కృంగి పోయింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అక్కడికి చేరుకుని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. రోడ్డు కింది డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఉన్నందున రోడ్డు కృంగిపోయి ఉంటుందని ఆయన అన్నారు.

బోనాల అభివృద్ధి పనులు ప్రారంభించండి


డీఈకి వినతిపత్రం ఇచ్చిన సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: రాబోయే బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు జీహెచ్‌ఎంసీ శాఖ త్వరతగతిన అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన జీహెచ్‌ఎంసీ డీఈ దేవేందర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులపై చర్చించారు. కుర్మగూడ డివిజన్‌లో రోడ్లు గుంతలమయంగా మారాయని అవసరమున్న చోట్ల తక్షణమే ప్యాచ్ వర్క్‌లు చేయాలని కోరారు. నాయకులు మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కాలనీలు జలమయం


టెలిఫోన్ కాలనీ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట జోన్ పరిధిలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు కాలనీల్లో నీరు చేరింది. డ్రైనేజీ నీరు కలిసి రోడ్లపై వర్షం నీరు ప్రవహించడంతో నల్గొండ క్రాస్‌రోడ్డు, మలక్‌పేట, చాదర్‌ఘాట్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

బోనాల నిధుల కోసం 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

హస్తినాపురం: రానున్న బోనాల పండుగను కాలనీల్లోని ఆలయాల వద్ద ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ నిధులు మంజూరు చేస్తుందని, ఈ నిధుల కోసం హస్తినాపురం డివిజన్‌లోని ఆలయాల పాలక మండలి దరఖాస్తు చేసుకోవాలని డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి తెలిపారు. గురువారం హస్తినాపురంలో ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ, డివిజన్‌లోని ఆలయాల కమిటీ సభ్యులు కమిటీ లెటర్ ప్యాడ్‌పై బోనాల అభివృద్ధి నిధుల కోసం అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్ రంగారెడ్డి జిల్లా అధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతేడాది వచ్చిన నిధులు ఎన్ని, ఈ సంవత్సరం ఎన్ని నిధులు కావాలనేది అందులో పేర్కొనాలన్నారు. ఆలయం, అమ్మవారి ఫొటోలతో పాటు కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల ఆధార్ కార్డులను జత చేసి ఈ నెల 30 లోపు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సత్యంచారి అన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రత దినోత్సవం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ లలితానగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్రం వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సంలో భాగంగా గురువారం స్వామివారి వ్రత దినోత్సవాని వైభవంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస గుప్తా, ఆలయ చైర్మన్ పూర నర్సింహ గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కొడకండ్ల శ్రీరామ చరణ్ శర్మ, ఆలయ ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, సలహాదారు చకిలం రమణయ్య, పాల్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీసీ ఆదిత్యకు ఉత్తమ దర్శకుడి అవార్డు



నాగోలు: సినీ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్యకు కోల్‌కతాకు చెందిన ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా సంఘం ఫౌండేషన్ ఉత్తమ దర్శకుడి పురస్కారం అందించింది. రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో వినూత్న ప్రయోగాలు చేస్తూ సమాజానికి సందేశం ఇస్తూ పూర్తిస్థాయి సినిమాలు, లఘు చిత్రాలు రూపొందిస్తున్న దర్శకుడు పీసీ ఆదిత్య సేవలను గుర్తించి కోల్‌కతాకు చెందిన సంస్కృతిక సంస్థ కళా సంఘం ఫౌండేషన్ స్థాపకురాలు దేవాంజలి, అధికారి సంస్కార్ న్యూస్ చీఫ్ ఎడిటర్ విజయ్ కుమార్ శర్మ పురస్కార పత్రాన్ని గురువారం ఆదిత్యకు పంపించారు. ప్రపంచ స్థాయిలో సాహితీ కేంద్రంగా పేరొందని కోల్‌కతా నుంచి తనకు ఉత్తమ దర్శకుడు పురస్కారం లభించడం ఆనందంగా ఉందని పీసీ ఆదిత్య అన్నారు. ఈ స్ఫూర్తితో మరిన్ని మంచి చిత్రాలు రూపొందిస్తానని, ఈ చిత్రాలలో నూతన కళాకారులు, సాంకేతిక నిపుణులకు అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఉత్తమ దర్శకుడు అవార్డు వచ్చిన ఆదిత్యను పలువురు అభినందించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు సహకరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంల పరిధిలోని ఎల్మినేడులో మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో గురువారం నోట్‌బుక్స్‌ను ఆయన అందజేశారు. అవకాశాలను అందిపుచ్చుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపాల్, కరుణాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, స్వామి, జంగయ్య, మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.